బోర్గిలో త్రీఫేజ్ కరెంట్‌కోసం ఆందోళన చేస్తున్న రైతులు

త్రీఫేజ్ సరఫరా చేయాలని ఆందోళన

కంగ్టి, మే 29: వారం రోజులుగా త్రీఫేజ్ విద్యుత్ సరఫరా కాకపోవడంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని కంగ్టి మండల పరిధిలోని బోర్గి గ్రామానికి చెందిన రైతులు బుధవారం ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వారం నుంచి త్రీఫేజ్ కరెంట్ సరఫరా సక్రమంగా లేదని, దీంతో వేసిన పంటలు ఎండిపోతున్నాయని వాపోయారు. విద్యుత్ అధికారులు స్పందించి త్రీఫేజ్ విద్యుత్‌ను సరఫరా చేయాలని కోరారు. కార్యక్రమంలో రైతులు తుకారం, బాబురావు, రాజేందర్‌రావు, రాందాస్, పీరాజీరావు, గజానంద్ తదితరులు పాల్గొన్నారు.

ఫౌండేషన్ సేవలు అభినందనీయం

మనూరు, మే 29: ఎస్‌బీఐ ఫౌండేషన్, భవిష్య భారత్ సేవా సంస్థ చేస్తున్న సేవలు అభినందనీయమని నారాయణఖేడ్ ఎమ్మెల్యే పట్లోళ సంజీవరెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని రాయిపల్లి గ్రామంలో ఆర్మీ ట్రైనీ సెంటర్‌లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆర్మీ ట్రైనీ సెంటర్ ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. ముఖ్యంగా ట్రైనీ సెంటర్‌కి అమ్మాయిలు రావడం చాలా గర్వంగా ఉందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహిస్తున్న ఇలాంటి శిబిరాలకు ప్రోత్సాహం అవసరమన్నారు. తనవంతు సహాయంగా తన శాలరీ నుంచి రూ.25 వేలు విరాళం ఇస్తున్నానని తెలిపారు. స్నేహితుల నుంచి, ప్రభుత్వం నుంచి కూడా ఆర్థిక సహాయం అందించేల చేస్తానన్నారు. భవిష్య భారత్ నిర్వహిస్తున్న రక్తదాన శిబిరానికి మంచి స్పందన లభించిందని తెలిపారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాచందర్, ఎంపీటీసీ దొండిరావు, కో ఆప్షన్ సభ్యులు సలీమ్, కారముంగి మాజీ సర్పంచ్ గుండేరావు, భవిష్య భారత్ కోఆర్డినేటర్ జహంగీర్, సభ్యులు అసద్, సమాజిక సేవా కార్యకర్త ఓంప్రకాష్ పాల్గొన్నారు.

ఆర్మీ ట్రైనీ సెంటర్ సభ్యులతో ఎమ్మెల్యే సంజీవరెడ్డి

నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

సదాశివపేట, మే 29: నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వ్యవసాయాధికారి నర్సింహారావు హెచ్చరించారు. బుధవారం పట్టణంలోని సత్యసాయి ఫర్టిలైజర్ షాపును ఆయన ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విత్తనాలను అధిక ధరకు విక్రయిస్తే లైసెన్సులు రద్దు చేస్తామన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జిల్లాకు 5,800 క్వింటాళ్ల జీలుగు, జనుము విత్తనాలను కేటాయిందని, ఇప్పటి వరకు 3,800 క్వింటాళ్ల విత్తనాలను 54 సెంటర్ల ద్వారా అందజేసినట్లు తెలిపారు. రెండుమూడు రోజుల్లో మరో 2వేల క్వింటాళ్ల విత్తనాలు రైతులకు అందుబాటులో ఉంటాయన్నారు. జిల్లాలో 3.60 లక్షల ఎకరాల్లో పత్తి సాగు కానున్నట్లు అంచనా వేశామని, దీనికి 7.20లక్షల పత్తి ప్యాకెట్లు అవసరమవుతాయన్నారు. ఇప్పటివరకు 2.60లక్షల పత్తి ప్యాకెట్లు జిల్లాకు వచ్చాయని, రైతులు 1.60లక్షల వరకు పత్తి ప్యాకెట్లను కొనుగోలు చేశారన్నారు. త్వరలోనే అవసరమైన పత్తి ప్యాకెట్లు అధీకృత డీలర్ల వద్దకు వస్తాయన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు మమత, అనిత, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బస్సు, బైక్ ఢీ: ఒకరికి గాయాలు

జిన్నారం, మే 29: బస్సు, బైక్ ఢీకొనడంతో ఒకరికి గాయాలయ్యాయి. ఈ ఘటన జిన్నారం మండలం గడ్డపోతారం గ్రామ శివారులో బుధవారం జరిగింది. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. జిన్నారం పంచాయతీ పెద్దమ్మగూడెం గ్రామానికి చెందిన తాళ్లపల్లి భిక్షపతి(38) పాల వ్యాపారి. బుధవారం ఉదయం బైక్‌పై బాలానగర్ వెళ్లి పాలు పోసి ఇంటికి తిరిగి వస్తుండగా గడ్డపోతారం శివారులోని ఎల్లమ్మగుడి సమీపంలో ఎదురెదురుగా వస్తున్న బస్సు, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో భిక్షపతి తలకు, కాళ్లకు గాయాలయ్యాయి. కుటుంబీకులు, స్థానికులు సమీపంలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. బొల్లారం పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

బస్సు, బైక్ ఢీకొన్న దృశ్యం

మహిళలకు ఉపాధి

చౌటకూర్, మే 29: కుట్టు మిషన్ శిక్షణ కేంద్రం ఏర్పాటుతో మహిళలకు స్వయం ఉపాధి దొరుకుతుందని ఐకేపీ డీపీఎం జయశ్రీరాజ్ అన్నారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో బుధవారం స్త్రీ శక్తి కుట్టు మిషన్ కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాల ఏర్పాటులో భాగంగా మొదటలగా చౌటకూర్‌లో ఈ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు అవసరమైన స్కూల్ యూనిఫాంను కుట్టువచ్చన్నారు. కార్యక్రమంలో ఏపీఎం శివలక్ష్మి, సీఏ సావిత్రి, వీవోఏ శోభ, వీవోబీబీలు సునీత, పుష్పమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

సొసైటీలో నిధుల దుర్వినియోగంపై ఫిర్యాదు

రామచంద్రాపురం, మే 29: తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని న్యూఎంఐజీ విద్యుత్‌నగర్ కాలనీ సొసైటీలో నిధుల దుర్వినియోగం జరిగిందని, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వల్లూరి క్రాంతికి, జిల్లా కోఆపరేటివ్ డిప్యూటీ రిజిస్ట్రార్‌కు బుధవారం కాలనీవాసులు యాదగిరిరావు, బాలయ్య, యాదగిరి, సుదర్శన్‌రెడ్డి, నర్సింహారెడ్డి, తదితరులు ఫిర్యాదు చేశారు. కాలనీ సొసైటీ పాలకపక్షం సభ్యులు ఇష్టానుసారంగా కాలనీవాసుల డబ్బులను దుర్వినియోగం చేయడంతోపాటు తప్పుడు బిల్లులు పెట్టి నిధులు డ్రా చేసుకున్నారని ఆరోపించారు. 2021-22లో సీసీ కెమెరాల ఇన్‌స్టాలేషన్ కోసం రూ.3,07,670, ఆఫీస్ ఫోల్డర్ ఫైల్స్ కోసం రూ.80 వేలు, ఇతర ఖర్చుల కింద రూ.2,54,074, ఇతర పనుల కోసం రూ.20వేలు, రెండు గేట్ల కోసం రూ.60 వేలు, 2022-23లో కాలనీ ఖర్చుల కింద రూ.2,12,053, ఆఫీస్ ఖర్చు కింద రూ.44,784, వాహనాల అద్దెల నిమిత్తం రూ.45,890 ఖర్చు అయినట్టు చూపించారన్నారు. కానీ, ఎక్కడా ఆ పనులు జరగలేదన్నారు. వీటిపై అధికారులు విచారణ చేపట్టి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థుల యూనిఫాం సిద్ధం చేయాలి

దిగ్వాల్ కేంద్రంలో కుడుతున్న దుస్తులను పరిశీలిస్తున్న అధికారులు

కోహీర్, మే 29: ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల కోసం యూనిఫాంను వెంటనే సిద్ధం చేయాలని జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఏపీడీ జంగారెడ్డి కోరారు. బుధవారం మండలంలోని దిగ్వాల్, కవేలి గ్రామాల మహిళా శక్తి కుట్టు శిక్షణ కేంద్రాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీల ఆధ్వర్యంలో చేపట్టిన దుస్తుల తయారీని ఆయన పరిశీలించారు. దుస్తులను కుట్టడంలో నాణ్యత పాటించాలన్నారు. కార్యక్రమంలో డీపీఎం జయశ్రీ, కొమురయ్య, ఎంఈవో శంకర్, ఏపీఎం సమ్మయ్య, మహిళలు పాల్గొన్నారు.

ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

హత్నూర, మే 29: వర్షాకాలం వస్తుండడంతో గ్రామాల్లో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సూచించారు. బుధవారం హత్నూర మండల సాధారణ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వావిలాల నర్సింహులు అధ్యక్షతన జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ వర్షాలు కురుస్తుండటంతో విద్యుత్ సమస్య తలెత్తుతుందని, విద్యుత్ అధికారులు లూజ్ వైర్లను గుర్తించి తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. గ్రామాల్లో పారిశుధ్య సమస్య తలెత్తకుండా చర్యలు చేపట్టాలన్నారు. పారిశుధ్యం లోపిస్తే అంటువ్యాధులు వ్యాపిస్తాయని, అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు. చింతల్‌చెరు పీహెచ్‌సీ వైద్యురాలు నేత్రావతి విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నదని వస్తున్న ఫిర్యాదులతో వైద్యురాలితో మాట్లాడటానికి ప్రయత్నించగా గైర్హాజరయ్యారు. పద్ధతి మార్చుకోకపోతే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో నాటిన మొక్కలను కాపాడాలని, నర్సరీల నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలన్నారు. గ్రామ పంచాయతీల్లో నిధుల కొరతతో ఇబ్బందులు ఎదురవుతున్నాయని, నిధుల మంజూరుకు కృషి చేయాలని పంచాయతీ కార్యదర్శులు కోరడంతో ప్రభుత్వం దృష్టికి తీసుకుపోయి నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో జడ్పీటీసీ ఆంజనేయులు, వైస్ ఎంపీపీ లక్ష్మీరవికుమార్, ఎంపీడీవో శంకర్, ఆయాశాఖల అధికారులు పాల్గొన్నారు.

పాఠశాలలను సిద్ధం చేయాలి

కలెక్టర్ వల్లూరు క్రాంతి

పాఠశాలలో ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

కోహీర్, మే 29: వచ్చే విద్యా సంపత్సరం ప్రారంభానికి ముందుగానే పాఠశాలల్లో పూర్తి ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం జహీరాబాద్ పట్టణ సమీపంలోని పస్తాపూర్ ప్రాథమిక పాఠశాల, హుగ్గెల్లి జడ్పీ ఉన్నత పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలను కల్పించాలని సూచించారు. తాగునీరు, మరుగుదొడ్ల నిర్వహణ సక్రమంగా ఉండాలన్నారు. ఎలాంటి పనులు మిగిలి ఉన్నా వెంటనే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్ణీత సమయంలోగా విద్యార్థులకు అవసరమయ్యే అన్ని సౌకర్యాలను కల్పించాలన్నారు. తరగతి గదుల్లో లైట్లు, ఫ్యాన్లు భిగించాలన్నారు. అనంతరం రాంనగర్ పాఠశాలను సందర్శించి అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ సభ్యులతో మాట్లాడారు. యూనిఫాంలను సిద్ధం చేయాలని సూచించారు. బాలికలు, బాలుర కొలతల ప్రకారం సరిపడా దుస్తులను రూపొందించాలన్నారు. అనంతరం జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో నిమ్జ్ అధికారులతో కలెక్టర్ సమావేశమయ్యారు. కార్యక్రమంలో ఆర్డీవో రాజు, తహసీల్దార్ సంజీవరావు, పంచాయతీరాజ్ డీఈఈ ప్రవీణ్‌కుమార్, ఏఈ కోటేశ్వర్‌రావు, ఎంఈవో బస్వరాజ్ పాల్గొన్నారు.

ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలి

సంగారెడ్డి, మే 29: వానకాలం సీజన్‌కు సంబంధించి రైతులకు సరిపోను ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచాలని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ బుధవారం ప్రకటనలో కోరారు. కాంగ్రెస్ పాలనలో రైతులు విత్తనాలు, ఎరువుల కోసం చెప్పులు, పట్టదారు పాసు పుస్తకాల జీరాక్సులను క్యూలో పెట్టాల్సిన దౌర్భాగ్యం వచ్చిందని ఆరోపించారు. కాంగ్రెస్‌కు రైతులపై ఉన్నది కపట ప్రేమ అని, పెట్టుబడి సాయం అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. రైతులకు బ్యాంకు రుణాలు అందేలా చూడాలని, వడగండ్ల వానలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

వసతి గృహంలో క్షుద్రపూజల కలకలం

బొల్లారం, మే 29: బొల్లారం మున్సిపాలిటీ పరిధిలోని తెలంగాణ ఆదర్శ పాఠశాల బాలికల వసతి గృహంలో క్షుద్ర పూజల వ్యవహారం స్థానికంగా కలకలం రేపింది. రెండు రోజుల కిత్రం వాడుకలో లేని బాలికల వసతిగృహంలో కొందరు గుర్తుతెలియని వ్యక్తులు రాత్రి వేళలో పాఠశాల గోడ దూకి వచ్చి క్షుద్ర పూజలు చేసిన ఆనవాళ్లు ఉన్నాయని సిబ్బంది గుర్తించారు. వింత ఆకారంలో వేసిన బొమ్మలతోపాటు వాటిపై పసుపు, కుంకుమ చల్లి కోడిగుడ్లు, వేప ఆకులు, నిమ్మకాయలతో పూజలు నిర్వహించారు. పూజలు చేసిన వసతి గృహ ప్రాంతాన్ని గమనించిన సిబ్బంది ఆందోళన చెందుతున్నారు. పాఠశాలలో సీసీ కెమెరాలు లేకపోవడంతో అసలు ఏం జరుగుతుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పాఠశాలలో జరుగుతున్న క్షుద్ర పూజలపై తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు.

బదిలీలు, ప్రమోషన్లు త్వరగా చేపట్టాలి

రామచంద్రాపురం, మే 29: గతంలో నిలిచిపోయిన ఉపాధ్యాయుల ప్రమోషన్లు, బదిలీల షెడ్యూల్‌ని వెంటనే చేపట్టాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కౌన్సిలర్ కే.రాజారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా ఆర్సీపురం మండల వనరుల కేంద్రం వద్ద టీపీటీఎఫ్ జెండాను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ పాఠశాలల్లో సిబ్బంది కొరత లేకుండా చూడాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీపీటీఎఫ్ నాయకులు పోచయ్య, సురేశ్‌కుమార్, విద్యాసాగర్, జనార్దన్, శ్రీనివాస్, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు

కంగ్టి, మే 29: ఫర్టిలైజర్ దుకాణాల్లో నకిలీ ఎరువులు, విత్తనాలను విక్రయిస్తే లైసెన్స్ రద్దుచేస్తామని నారాయణఖేడ్ ఏడీఏ నూతన్‌కుమార్ హెచ్చరించారు. బుధవారం కంగ్టిలో ఫర్టిలైజర్ దుకాణాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పత్తి విత్తనాలకు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఎరువులు, విత్తనాలకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఏవో ప్రవీణ్‌చారి తదితరులు ఉన్నారు.

పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించాలి

టెలీ కాన్ఫరెన్స్‌లో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సంగారెడ్డి కలెక్టరేట్, మే 29: జిల్లాలో ఎన్నికల కోడ్ ముగియగానే ప్రజావాణి తిరిగి ప్రారంభమవుతుందని, ఈ లోగా అన్ని ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులను పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం సాయంత్రం టెలీ కాన్ఫరెన్స్ ద్వారా ధాన్యం కొనుగోళ్లు, ధరణి దరఖాస్తుల పరిష్కారం, ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారం తదితర అంశాలపై సమీక్షించారు. ధరణి దరఖాస్తులు పెండింగ్‌లో లేకుండా చూడాలని, ప్రజావాణి దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, ధాన్యం కొనుగోలులో డేటా ఎంట్రీ పూర్తి చేయాలన్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటవెంటనే మిల్లులకు తరలించాలని ఆర్డీవోలను, తహసీల్దార్లను ఆదేశించారు. జొన్నల కొనుగోలు కేంద్రాల వద్ద రైతులకు సౌకర్యాలు కల్పించాలన్నారు.

భూసేకరణను వేగవంతం చేయాలి

కోహీర్, మే 29: నిమ్జ్ భూసేకరణను పూర్తి చేయాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం జహీరాబాద్ ఆర్డీవో కార్యాలయంలో నిమ్జ్ భూసేకరణపై రెవెన్యూ, నిమ్జ్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. నిమ్జ్‌కు ప్రభుత్వం ఇటీవల రూ.54 కోట్లు విడుదల చేసినట్లు తెలిపారు. ఈ నిధులను భూములు కోల్పోయిన వారికి చెల్లించాలని సూచించారు. సమావేశంలో నిమ్జ్ ప్రత్యేక అధికారి రవీందర్‌రెడ్డి, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి, ఆర్డీవో రాజు, తదితరులు పాల్గొన్నారు.

జొన్న రైతులకు ఇబ్బందులు కలిగించొద్దు

ఝరాసంగం, మే 29: జొన్న రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా కొనుగోళ్లు సజావుగా సాగేలా చూడాలని కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. బుధవారం ఝరాసంగంలోని జొన్నల కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రైతుల సమస్యలను తెలుసుకున్నారు. జొన్నల కొనుగోళ్లపై ఆరాతీశారు. అక్కడి నుంచి ఝరాసంగంలో డీఆర్డీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళాశక్తి కుట్టు కేంద్రాన్ని సందర్శించారు. కుట్టిన విద్యార్థుల యూనిఫాంలను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఆర్డీవో రాజు, తహసీల్దార్ సంజీవరావు, ఎంపీడీఓ సుధాకర్ ఉన్నారు.

ప్రజా సమస్యలు పరిష్కరించాలి

కోహీర్, మే 29: ప్రజలకు విద్య, నాణ్యమైన వైద్యం ఉచితంగా అందించినప్పుడే తెలంగాణ అభివృద్ధి చెందుతుందని టీపీటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జనార్దన్‌రెడ్డి, రాష్ట్ర నాయకుడు నాగేశ్వర్‌రావు అన్నారు. బుధవారం జహీరాబాద్ పట్టణంలోని ఎంఈవో కార్యాలయ సమీపంలో టీపీటీఎఫ్ ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులతోపాటు రైతులు, ప్రజా సమస్యల పరిష్కారానికి టీపీటీఎఫ్ నిరంతరం పోరాడుతుందన్నారు. డీఏలు, పీఆర్సీ కూడా వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. రైతుల సమస్యలను పరిష్కరించాలన్నారు. తప్పులు చేసే ప్రభుత్వాలను ప్రశ్నించేత్వం ప్రజలకు నేర్పిస్తామని, నిరంతరం వారిని జాగృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు రుక్మొద్దీన్, జీవన్‌రావు, నర్సింహులు, భీంవంశీ, అమృత్, నాగన్న, చంద్రశేఖర్, శ్రీనివాస్, జగదీశ్వర్, పాండు, నారాయణ, సురేశ్‌బాబు, వెంకన్న, శివరత్నం, అమర్‌నాథ్, తదితరులు పాల్గొన్నారు.

కిడ్నాప్, హత్య కేసులో నలుగురి రిమాండ్

కల్హేర్, మే 29: వ్యక్తిని కిడ్నాప్ చేసి హత్య చేసిన ఘటనలో నలుగురిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించినట్లు కల్హేర్ ఎస్సై వెంకటేశం మంగళవారం తెలిపారు. ఈ నెల 23వ తేదీన కల్హేర్ మండలం కృష్ణాపూర్ గ్రామానికి చెందిన మల్లోడ్డి వెంకటేశంను కల్హేర్ శివారులో గుర్తు తెలియని వ్యక్తులు కిడ్నాప్ చేశారు. అదేరోజు అతడి భార్య విజయ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. వెంకటేశం పెద్దమ్మాయికి కామారెడ్డి జిల్లా జూకల్ మండలం లాడేగావ్ గ్రామానికి చెందిన మేనల్లుడు నరేందర్‌ను ఇల్లరికం తెచ్చుకున్నాడు. తర్వాత విడాకులు కాగా మరో పెండ్లి చేసుకున్నాడు. గతంలో నరేందర్ వెంకటేశానికి రూ.14 లక్షలు ఇచ్చాడు. తిరిగి డబ్బులు చెల్లించడం లేదని అమ్మ గంగమణి, మేన మామ వెంకటేశం మధ్య వివాదాలు తలెత్తాయి. నరేందర్ దంపతుల సంసారం సజావుగా సాగడం లేదని, అందుకు మేనమామ వెంకటేశం బాణామతి చేస్తున్నాడని అనుమానంతో వెంకటేశం హత్యకు ప్రణాళిక వేసుకున్నారు. రోజు వారి కదలికలను పసిగట్టారు. నరేందర్ విద్యుత్ శాఖలో ఏఈగా విధులు నిర్వహిస్తున్న చోట కొందరితో పరిచయం చేసుకున్నారు. అమ్మ గంగమణితో పాటు మరో ఆరుగురితో తుఫాన్ వాహనంలో కల్హేర్ శివారుకు వచ్చి కాపుకాశారు. రెండు బైకులపై కల్హేర్‌లోకి వచ్చి మధ్యాహ్నం 12 గంటల సమయంలో వెంకటేశానికి మాయమాటలు చెప్పి బైక్‌పై శివారులోకి తీసుకువచ్చి కంట్లో కారం చల్లి తుఫాన్‌లో జూకల్ శివారుకు తీసుకువచ్చారు. అక్కడ వెంకటేశానికి కరెంట్ షాక్‌తో దాడి చేస్తున్న క్రమంలో తుఫాన్ డ్రైవర్ అక్కడి నుంచి పంపించేశాడు. అక్కడి నుంచి కారులో మహారాష్ట్ర దెగ్లూర్ శివారుకు వెళ్లి కట్టెలతో తీవ్రంగా కొట్టి గాయపరిచి హత్య చేశారు. హత్యకు గురైన వెంకటేశం మృతదేహాన్ని 24వ తేదీన ఉద్‌గీర్ అటవీ ప్రాంతంలోని బావిలో పడేశారు. హత్యకు పాల్పడిన నరేందర్, అతడి తల్లి గంగమణి, బాబున్ కంబెలే, తుఫాన్ డ్రైవర్ విఠల్‌ను అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. మరో నలుగురు పరారీలో ఉన్నారని, వారి కోసం గాలిస్తున్నామని ఎస్సై వెంకటేశం పేర్కొన్నారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ కప్‌ను అందజేస్తున్న హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ సభ్యులు

టోర్నీ విజేత మెదక్ జట్టు

23 పరుగులతో ఇంటర్ డిస్ట్రిక్ట్ కప్ సొంతం

సంగారెడ్డి కలెక్టరేట్, మే 29: హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరుగుతున్న టీ-20 అంతర్ జిల్లా క్రికెట్ టోర్నమెంట్ కప్‌ను ఉమ్మడి మెదక్ జిల్లా జట్టు సొంతం చేసుకున్నది. బుధవారం ఉప్పల్ స్టేడియంలో జరిగిన ఫైనల్స్‌లో 23 పరుగుల తేడాతో మెదక్ విజయం సాధించింది. ఫైనల్స్‌లో టాస్ గెలిచిన మెదక్ జట్టు తొలుత బ్యాటింగ్ ఎంచుకున్నది. మెదక్ జిల్లా జట్టు నిర్ధారిత 20 ఓవర్లలో కేవలం 4 వికెట్లు కోల్పోయి 168 పరుగులు చేసింది. ఇందులో అఫ్రిదీ 80 పరుగులు చేయగా, సందీప్ 33, సాయినాథ్ 29 పరుగులు చేశారు. అనంతరం బ్యాటింగ్ చేసిన కరీంనగర్ జట్టు 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 145 పరుగులు చేసింది. మెదక్ జట్టు బౌలింగ్‌లో శ్రీధర్ 3 వికెట్లు తీశాడు. దీంతో 23 పరుగుల తేడాతో కరీంనగర్‌పై ఫైనల్స్‌లో విజయం సాధించి ఇంటర్ డిస్ట్రిక్ట్ కప్‌ను సొంతం చేసుకున్నది. విజేత జట్టుకు హెచ్‌సీఏ ప్రెసిడెంట్ జగన్మోహన్ రావు కప్ అందజేశారు. కార్యక్రమంలో మెదక్ జిల్లా క్రికెట్ అసోసియేషన్ కార్యదర్శి రాజేందర్‌రెడ్డి, అసోసియేషన్ సభ్యులు మధుమోహన్ రెడ్డి, శ్రీనాథ్ రెడ్డి, జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

యోగా శిక్షణ తరగతులు ప్రారంభం

గుమ్మడిదల, మే 29: తెలంగాణ యోగా సన స్పోర్ట్స్ అసోసియేషన్ 4వ రాష్ట్ర స్థాయి యోగాసన్ జడ్జిస్ శిక్షణను టీవైఎస్ఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీధర్‌రావు ప్రారంభించారు. శిక్షణ తరగతులు ఈనెల 31 వరకు కొనసాగుతాయని తెలిపారు. ఆయన ఆధ్వర్యంలో మండలంలోని అన్నారం ప్రకృతి నివాస్‌లో బుధవారం యోగా శిక్షణ తరగతులను ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ భవిష్యత్ తరాల కోసం స్వామి రాందేవ్‌బాబా చూపిన బాటలో పయనించాలని పిలుపునిచ్చారు. విశిష్ట అతిథిగా హాజరైన హిందూస్తాన్ ఎరోనాటిక్స్ లిమిటెడ్ పూర్వ ఇండిపెండెంట్ నేషనల్ డైరెక్టర్ మల్లారెడ్డి మాట్లాడుతూ యోగా ద్వారానే ప్రజలకు సరైన జీవనం అలవడుతుందన్నారు. యోగా దినోత్సవానికి అన్ని దేశాల్లో విశేష స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో టీవైఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నందనం కృపాకర్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాందెడ్డి, తోట సతీశ్‌కుమార్, గోపాలకృష్ణ, రాజారెడ్డి, సరెడ్డిగారి భిక్షపతిరెడ్డి, మధుగౌడ్ పాల్గొన్నారు.

అక్రమ నిర్మాణాలపై కొరడా

అమీన్‌పూర్, మే 29: అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో అక్రమ కట్టడాలపై రెవెన్యూ యంత్రాంగం కొరడా ఝుళిపించింది. సర్వే నంబర్ 1042, 1043, 1044,1045 లలోని సీలింగ్ భూముల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన అక్రమ కట్టడాలను తహసీల్దార్ ఆదేశాల మేరకు రెవెన్యూ సిబ్బంది జేసీబీతో కూల్చివేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ... మున్సిపాలిటీలోని ప్రభుత్వ భూముల్లో ఎలాంటి నిర్మాణాలు చేపట్టినా ఉపేక్షించేది లేదన్నారు. సీలింగ్ భూముల్లో చేపట్టిన అక్రమ నిర్మాణాలను గుర్తించి కూల్చివేతలు చేసినట్లు తెలిపారు. గతంలో కూడా కూల్చివేతలు చేసిన మళ్లీ తిరిగి నిర్మించడంతో వాటిని సైతం గుర్తించి కూల్చివేతలు చేస్తామన్నారు. దాదాపు 6 నిర్మాణాలను నేలమట్టం చేశారన్నారు. ఇష్టారాజ్యంగా అక్రమ నిర్మాణాలు చేపడితే క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మున్సిపాలిటీ వ్యాప్తంగా టాస్క్‌ఫోర్స్ బృందం అక్రమ నిర్మాణాలను పర్యవేక్షిస్తుందని తెలిపారు.

గుమ్మడిదలలో డంపింగ్‌యార్డును పరిశీలిస్తున్న డీపీవో సాయిబాబా

పంచాయతీని తనిఖీ చేసిన డీపీవో

గుమ్మడిదల, మే 29: మండల కేంద్రమైన గుమ్మడిదలను బుధవారం డీపీవో సందర్శించారు. డంపింగ్‌యార్డు, పల్లెప్రకృతివనం, నర్సరీ, క్రీడాప్రాంగణాన్ని పరిశీలించారు. ఆయనవెంట మండల పంచాయతీ అధికారి దయాకర్‌రావు, పంచాయతీ ఈవో రాములు ఉన్నారు.

నర్సరీలను పకడ్బందీగా నిర్వహించాలి

హత్నూర, మే 29: గ్రామాల్లో ఏర్పాటు చేసిన నర్సరీల నిర్వహణ పకడ్బందీగా ఉండాలని డీఎ